# 3. బైపాస్

బైపాస్ అనే మాట వాడకంలో కొచ్చి ఎన్నాళ్లో కాకపోయుండొచ్చు కానీ, బైపాస్ చెయ్యడం అనే ప్రక్రియ అనేక రంగాల్లో అనాదినుంచి అమల్లో ఉన్నట్టే వుంది.

బైపాస్ రోడ్ల నిర్మాణం అవసరం అయ్యాక ఈ మాట బహుళ ప్రచారంలోకి వచ్చిందని ఉరమరిగ్గా చెప్పుకోవచ్చు. జనానికి పల్లెటూళ్లలో ఆర్జించుకునే డబ్బు విచ్చలవిడిగా ఖర్చుపెట్టుకోవడానికి అక్కడ అవకాశాలు లేకపోవచ్చు, పల్లె జనం టౌన్లు పట్టెయ్యడం జరుగుతోంది. పట్టణాలు ఇరుకవడం, పట్టణాల్లో కూడా అంతంత మాత్రంగానే ఉన్న రోడ్ల మీద వాహనాల రద్దీ అధికం కావడం; ఈ కారణాల వల్ల అనేక పట్టణాలకి బైపాస్ రోడ్లు అవసరం అయ్యాయి.

తమ్మిరాజు అని, నాతోపాటు పనిచేసిన ఒక గుమస్తా ఉండేవాడు. అతను చాలా సమర్థుడు. కొత్త ఆఫీసర్ ఎవరొచ్చినా సరే చార్జీ తీసుకున్ననాడు చేసుకునే టీ పార్టీ సమయంలోనే తమ్మిరాజు ప్రతిభా సామర్థ్యాలను గురించి (పాత ఆఫీసర్ ముఖతా) వినేయడం ఇహ అక్కణ్ణుంచి ఆఫీసులో ఏ వ్యవహారం మీద చిన్న సలహా కావలసి వచ్చినా తమ్మిరాజును పిలిచి సంప్రదించడం పరిపాటి అయిపోతుంది. ఆఫీసు పనుల్లోనే కాకుండా వ్యక్తిగత వ్యవహారాల్లో కూడా తమ్మిరాజు ఎప్పటి కెయ్యది ప్రస్తుతమో అప్పటికా మాట ఆడగలడుగనుక అతని సలహాలు సాధారణంగా బీరుపోయేవి గాదు.

ఆఫీసర్ తనని పిలిచి సలహా అడిగే విషయాల్లోనే కాక తన అభిరుచి అభీష్టాల మేరకు ఆఫీసర్ల చేత ఆర్డర్స్ వేయించడంలో కూడా తమ్మిరాజు ఘటికుడు. అయితే, ఆఫీసర్ కీ ఇతనికీ మధ్య మేనేజర్ అని ఒక శాల్తీ ఉంటాడు కదా. అతన్ని బైపాస్ చెయ్యడం అప్పుడప్పుడు తమ్మిరాజుకి కొంచెపాటి సమస్యగా తగిలినా దాన్ని నేర్పుగా పరిష్కరించుకోవడం కూడా అతనికి తెలుసు. మాట వరసకి సుబ్బారావు ట్రాన్స్‌ఫర్ విషయమే తీసుకొందాం. ట్రాన్స్‌ఫర్ చెయ్యండి బాబోయ్- అని అతని దరఖాస్తు ఉన్నది. తమ్మిరాజు అడ్డుపడకుండా ఏర్పాట్లు ముందే జరిగాయి. అయితే సుబ్బారావు పెట్టిన దరఖాస్తు కాగితం ఆఫీసుకి చేరిననాడు మేనేజర్ ఆ కవరు విప్పి "చూడు, చూడు! ఈ సుబ్బారావు ఈ వూరికి వచ్చి ఆరునెలలు అయిందో లేదో- అప్పుడే ట్రాన్స్‌ఫర్ కావాలిట!" అన్నాడు. అంటే ఏమన్న మాటా, సుబ్బారావు కాగితం మీద సిఫార్సు చేస్తూ తమ్మిరాజు నోటు పెట్టినా సరే, దాని మీద మేనేజర్ గారు అడ్డగోలగా ఏదో రాసేసి కొక్కెం పెట్టేస్తాడన్నది ఖాయం. అందుచేత మేనేజర్ని బైపాస్ చేస్తే తప్ప పని జరగదు. కాని, ఆఫీసు- అనే పరమ పద సోపాన పటంలో "హైరార్కీ" పాటించి తీరాలి కదా! అందుకని మేనేజర్ సెలవు పెట్టిన రోజున సుబ్బారావుని ఆఫీసర్ దగ్గరికి తరిమి మొరపెట్టించుతాడు. "అయ్యా, నాకు ఈ వూరి నీళ్లు పడ్డం లేదు, ఏనుగు లాగ వచ్చి పీనుగు

లాగ తయారయ్యేను. ట్రాన్స్‌ఫర్ కావాలని అప్లికేషన్ పెట్టి ఆరు వారాలయింది" అంటూనూ. ఆఫీసర్ గారు తమ్మిరాజుని పిల్చి " ఏమిటయ్యా ఇతని గొడవ? చూడు!" అని చెప్పేస్తారు. పావుగంటలో నోట్ తయారయిపోతుంది. మేనేజర్ గారు బైపాస్ అయిపోవడం, సుబ్బారావు ట్రాన్స్‌ఫర్ అయిపోవడం. ఫటాఫట్.

మా ఇంట్లో మొదట్నించీ దీపం మార్కు వస్తువులే వాడతాం. ఈ కంపెనీ హైద్రాబాద్‌లో వుంది. సబ్బుల దగ్గర్నుంచి సవరాల దాకాను, ఆవకాయ నుంచి పేక దస్తాల వరకూను- ఎన్నో వస్తువులు వాళ్ల తయారు చేస్తారు. పత్రికలు, సినిమాలు ఎన్నో రకాలు హైదరాబాద్‌లో, వరంగల్లో, బెజవాడలో, తిరుపతిలో, రాజమండ్రిలో, విశాఖపట్నంలో వాళ్ల ఫ్యాక్టరీలున్నాయి. నరసింహం గారని, ఈ కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ గారు. ఆ మధ్య కాకతాళీయంగా (రైల్లో నాకు సెకండ్ క్లాస్ టిక్కెట్ దొరక్క; ఆయనకి ఫ్లయిట్ అందక) మేం యిద్దరం ఫస్టు క్లాసులో ప్రయాణం చేసిన సందర్భంగా పరిచయం అయ్యారు. వారు ఫలానా అని తెలియగానే నాకు, మా కుటుంబ సభ్యులకి, నా సన్నిహిత మిత్రులకి, వారి కంపెనీ వస్తువుల మీద ఏళ్ల తరబడి నుంచి ఉన్న అభిమానాన్ని దాచుకోకుండా వివరంగా వ్యక్తపరచగా ఆయన నన్ను ఎంతో సన్నిహిత మిత్రుడుగా పరిగణించి, వారి కంపెనీ ఆఫీసుకి తీసుకెళ్లి అందరికి పరిచయం చెయ్యడమే కాకుండా; వారి కంపెనీ క్యాలండరు, డయిరీ, పెన్‌స్టాండ్ వంటి కొన్ని వస్తువులు బహుమతిగా ఇచ్చి- ఎప్పుడు హైద్రాబాద్ వచ్చినా తప్పక తమ దర్శనానికి రమ్మని కోరారు. ఇదంతా జరిగి ఎనిమిది నెలలయింది.

"అతి పరిచయా దవజ్ఞ" అన్న సూత్రం ప్రకారమో మరేమిటో తెలియదు గాని, ఈ మధ్య దీపం మార్కు సరుకుల్లో నాణ్యత తగ్గిపోయినట్టు స్పష్టంగా తెలిసిపోతోంది. ఏదో ఒక వస్తువు విషయంలోనో ఒక విడుదలలో వచ్చిన కొన్నిట్లోనో కాక, ఈ పతనం సర్వత్రా కనబడ్డంతో ఈ సారి హైద్రాబాద్ వెళ్లినపుడు నా అభిప్రాయం నరసింహం గారికే సరాసరి మనవి చేద్దామని నిశ్చయించుకున్నాను. ఆయన్ని బాధ పెట్టాలనే ఉద్దేశ్యం నాకు లేదు. ఎందుకంటే లోగడ ఆయన్ని కలసి నపుడు ఆయనే అన్నారు: "మా సరుకు మీకు నచ్చినట్లయితే మీ మిత్రులకు చెప్పండి. నచ్చక పోతే మాకే చెప్పండి" -అని.

సరిగ్గా ప్రయాణం రోజునే ఈ వూరి దీపం మార్కు సరుకుల ఏజెంట్ గారు కనబడ్డారు. 'హైద్రాబాద్ వెడుతున్నాను. మీ కంపెనీ ప్రొడక్షన్ మేనేజర్ బావున్నారా?' అన్నాను. "ఇప్పుడు బాగానే ఉన్నారండీ. ఈ మధ్య ఆయనకి హార్టు ట్రబులొచ్చినందువల్ల అమెరికా వెళ్లి బైపాస్ సర్జరీ చేయించుకున్నారు, మీకు తెలుసుగా" అన్నాడాయన."అయ్యో అలాగా? అయితే తప్పకుండా ఆయన్ని పలకరించ వలసిందే" అన్నాను.

రెండుసార్లు కంపెనీకి ఫోన్ చేస్తే ఆయన ఇప్పుడు చీఫ్ ప్రొడక్షన్ మేనేజర్ అయ్యారని ; ఒకటి రెండు రోజులు ఆఫీసుకి రారని, అర్జంటు పనుంటే ఇంటి దగ్గర కలవ్వచ్చునని తెలిసింది.

సరేకదా అని ఇంటికి వెళ్లాను. ఆయన ఆరోగ్యం గురించి భోగట్టా చేసిన తరువాతనే

ఆ కంపెనీ సరుకుల నాణ్యత తగ్గిపోయిన విషయం చెప్పడం ధర్మం కదా. అందుచేత ఆ ప్రకారమే సంభాషణ నడిపించాను. ఆయన తన గుండె జబ్బు పూర్వాపరాలు, బైపాస్ సర్జరీ సంగతులు, అమెరికా అనుభవాలు చాలా వివరంగా చెప్పారు. అమెరికా నుంచి రాగానే తనకి చీఫ్ ప్రొడక్షన్ మేనేజర్‌గా ప్రమోషన్ వచ్చినట్లు ఆయన చెప్పగా అభినందనలు తెలిపాను.

అప్పుడు నాగోడు వెళ్ళబోసుకున్నాను. "అలవాటైన వాసనే ఓ అనుభవం కదా. ఏళ్ల తరబడి మీ కంపెనీ వస్తువులు వాడుతూ ఉండటం వల్ల వాటి నాణ్యత తగ్గిపోతూ ఉంటే చూస్తూ వూరుకోలేక, మరో కంపెనీ వస్తువుల్లోకి మారలేక బాధగా ఉంది." అన్నాను.

"ఆరు ఫ్యాక్టరీలకీ ప్రొడక్షన్ మేనేజర్‌గా నేను ఒక్కణ్ణే ఉన్నప్పుడు పద్ధతిగా ప్రతి ఫ్యాక్టరీకి నెలకి రెండేసి సార్లు వెళ్లి ఫార్ములాల ప్రకారం మిశ్రమాలు తయారవుతున్నాయా లేదా అని స్వయంగా చూసుకునే వాణ్ణి. ఇప్పుడు ఆరు ఫ్యాక్టరీలకీ ఆరుగురు ప్రొడక్షన్ మేనేజర్లు వచ్చి నేనేమో చీఫ్ అయిపోయాను. నా ఇష్టం వచ్చినపుడు నాఇష్టం వచ్చిన ఫ్యాక్టరీకి వెళ్లి చెక్ చెయ్యొచ్చు కాని, నాకు గుండె జబ్బు అని ముద్రపడిపోయింది కదా. ప్రయాణాల వల్ల పని తీవ్రత వల్ల కలిగే ఒత్తిడి నేను తట్టుకోలేక పోవచ్చునని మా కంపెనీ డాక్టర్స్ వెలిబుచ్చిన అభిప్రాయాల మేరకు నన్ను, అన్ని యూనిట్లనుంచి వస్తున్న లెక్కలు మాత్రం జాగ్రత్తగా చెక్ చేసుకుంటూ ఆఫీసులోనే ఉండి పొమ్మన్నారు మా యాజమాన్యం వారు" అని చెప్పారు నరసింహం గారు.

సరే, నరసింహం గారితో కాకపోతే మరొకరితో అయినా, దీపం మార్కు సరుకుల నాణ్యతలో వచ్చిన పతనం గురించి చెప్పాలి కదా అని హైద్రాబాదు ఫ్యాక్టరీ ప్రొడక్షన్ మేనేజరు గార్ని కలిసాను.

"కూర్చోండి. మీరు నరసింహం గారి ఫ్రెండటగా?"

"ఫ్రెండు అనేది పెద్దమాట. వారితో పరిచయం ఉంది. వారి అభిమానిని. శ్రేయోభిలాషిని అనుకోండి-"

"పాపం, బలే అవస్థయిపోయింది. ఐనా మేనేజిమెంట్ ఆయన్ని బాగా చూస్తున్నారు లెండి. అంతకు ముందు నాలుగు వేలు జీతం ఇచ్చేవారు. ఇప్పుడు సి.పి.యం. అయినాక ఎనిమిది వేలు చేశారు. అమెరికా వెళ్ళి రావటానికి, ఆపరేషన్‌కీ మొత్తం లక్ష రూపాయలకి పైగా కంపెనీ ఆయన మీద పెట్టుబడి పెట్టింది. అదంతా వసూలు గావాలంటే ఈ రెండు పద్ధతులూ తప్పలా."

"రెండు పద్ధతులేమిటి?" అన్నాను వెర్రి మొహం వేసి.

"పెంచిన జీతం నాలుగువేలు అప్పు తీర్మానం కింద విరగ్గోసుకుంటున్నారనుకోండి. అదెంతకి వచ్చేను! అందుకని ఓవరాల్‌గా సరుకుల నాణ్యత కొద్దిగా తగ్గించుకుని ఉత్పత్తి స్థానంలోనే కొంత మిగులు చూపించుకోవలసి వచ్చింది!"

నరసింహం గారి గుండెకూ ఉద్యోగానికీ జరిగిన బైపాస్ సర్జరీ ఉదంతం ఆ విధంగా తేట తెల్లం కాగా నేను ఆశించిన మనశ్శాంతి నాకు లభించినట్లయింది. ★

# 4. నష్టపరిహారం

నాతో బాటు కాలేజీలో చదువుతూ ఉండేవాడు; రంగధాం అని. ఇప్పుడెక్కడున్నాడో తెలీదు కాని, అతనికి ఇంటర్ సెకండియర్ చదువుతూ ఉన్నప్పుడే గెడ్డం మొలవడం ప్రారంభించింది. "ఎదగడానికెందుకురా తొందర; ఎదర బ్రతుకంతా చిందర వందర" అనే పాట ఆ రోజుల్లో లేదు. అంచేత గెడ్డం మొలుస్తున్నందుకు కొంచెం చీదరగా ఉన్నా పెద్దవాడి నవుతున్నాననే సరదా గెడ్డంతో పాటే మొలవడం పెరగడం ఆరంభమైంది మా రంగధాంకి.

పెరుగుట విరుగుట కొరకే అన్న సూక్తి గెడ్డానికి వర్తించినంత చదునుగా ఇంక దేనికీ వర్తించదనుకుంటాను. ఇద్దరమూ రూం మేట్స్ కదా, పళ్లుతోముకోవడం, మొహం కడుక్కోవడం రాత్రి 'పిడి' పట్టిన మేటర్ కంఠస్థం అయిందా లేదా అని సరి చూసుకోవడం ఇలాంటి వాట్లో నేను తలమునకలవుతున్న సమయంలో రంగధాం ఒక అద్దం ముందరేసుకొని కూచుని గెడ్డం తడుముకుంటూ అదో ఫెంటాస్టిక్ వరల్డ్‌లోకి వెళ్ళిపోయేవాడు. "అలా చూసుకుంటూ కూర్చోకు; టైం వేస్టు." అని నేనంటే అరమోడ్పు కళ్లతో "తీస్తున్న కొద్దీ పెరిగేదీ ఏమిటిరా, గోపాలం?" అని అడిగేడు. "గొయ్యి" అన్నాను. "కాదు. మరో ఛాన్సు ఇచ్చాను, ఆలోచించి చెప్పు" అన్నాడు.

"అప్పు"అన్నాను. "ఒరి నీతెలివి తెల్లారా! తీస్తున్న కొద్దీ పెరిగేది గెడ్డం రా!"అన్నాడు. "ఇంకేం, తీసినా పెరుగుతుంది కదా? తియ్యడం మొదలెట్టు" అన్నాను.

అలా ప్రారంభమైన రంగధాం గెడ్డం ఖండనోదంతం ఒకనాడు అతను గెడ్డం గీసుకుంటూ ఉండగా చెంప కొంచెం తెగడంతో ఒక కొత్త మలుపు తిరిగింది. ఇప్పట్లాగ అప్పుడు స్టెయిన్ లెస్ స్టీలు బ్లేడులు లేవు. బాగా డబ్బు ఖర్చుపెట్టగలిగిన వాళ్లకి ఇంగ్లాండులో తయారయిన బ్లేడులు దొరికేవి. అయితే గెడ్డం గీస్తున్నప్పుడు హస్తవాసిలో చిన్నతేడా వస్తే చెంప కొయ్యడంలో ఫారిన్ బ్లేళ్లూ, ఇండియన్ బ్లేళ్లూ అన్న తేడా ఉండదు కదా. ఆ విధంగా మన నిత్య జీవితంలో కనీసం ఒక్కచోటైనా ప్రాక్పశ్చిమ విభేదం లేని అంశం ఉంది కదా అని ఎంతో ముచ్చట పడిపోయేవాళ్ళం.

తనంతట తాను గెడ్డం గీసుకోవడంలో ఖర్చు ఎలాగా తప్పదు, పైగా టైం ఎక్కువ పట్టేస్తోందని, చెంప మీదనో, గెడ్డం కిందనో గాటు పెట్టుకునే రిస్కు కూడా ఉందని గ్రహించిన రంగధాం ఒకనాడు కాలేజీకి పావుగంట ముందుగా బయలు దేరి, ఒక "ఆయుష్కర్మశాల" లో దూరేడు. "ఇప్పుడే వెళిపోదాం ; రా నువ్వుకూడా!" అన్నాడు కదాని నేనూ వెళ్ళాను. ఆ లోపల ఒక రౌండు కుర్చీ, ఒక బెంచీ ఉన్నాయి. "ప్రతి **మంగళ్ల వారము** శెలవు" అని బోర్డుంది. "మేము క్షుర కర్మ చేయు సమయములో మీకు కత్తిగాటు పడినచో మీకు నష్టపరిహారం లభించును". అని ఇంకో బోర్డున్నాది. రంగధాం రౌండు కుర్చీలో కూర్చుంటూ, ఆర్టిస్టు తన మెడ మీదుగా గుడ్డచుట్టి వెనకాల ముడివేస్తున్న సమయంలో "నష్టపరిహారం అని బోర్డు పెట్టేవేంటీ?" అని అడిగాడు, గెడ్డం కన్నా బలంగా లోపల పెరిగిన భయం అట్టే తెలియనివ్వకుండా ఉండడానికి మొహం మీద చిన్న నవ్వు పూసుకొని. దానికి ఆ కర్మచారి గర్వంగా "అదేటి